GOLCONDA TIMES NEWS

# గోల్కొండ టైమ్స్

www.golcondatimes.com గురువారం 22, మే 2025 



## తెలంగాణకు ఎల్లో అలెర్ట్ !

- రానున్న ఐదు రోజులు వానలు
- 40-50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక


04



## ముందస్తు రుతు పవనాలు

04

- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేస్తూ నిర్ణయం



# నేలకొరిగిన దళపతి

## మావోయిస్ట్ అగ్రనేత బసవరాజు హతం

- సల్వాజుడుంను తిప్పికొట్టిన దాడి వ్యూహకర్త ఇతడే..
- చత్తీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ • కీలక నేతతో పాటు 27 మంది మృతి
- ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పై ఆనందం వ్యక్తం చేసిన అమిత్ షా
- వచ్చే ఏడాదిలో మావోయిజాన్ని అంతం చేస్తామని పునారుద్ఘాటన
- నక్సలిజం అంతానికి మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని 'ఎక్స్'లో ప్రకటన

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురు దెబ్బ తగిలింది. వచ్చే ఏడాది నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని ప్రకటించిన కేంద్రప్రభుత్వం, వారి ఏరివేతకు 'ఆపరేషన్ కగార్'ను చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ, ఏపీ, చత్తీస్ ఘఢ్ సరిహద్దుల్లోని దండకారణ్యంలో భారీ కూంబింగ్ ఆపరేషన్ చేస్తోంది. ఇందుకోసం.. డెడికేటెడ్ బలగాలను కేటాయించి.. దండ కారణ్యం లోపలికి బలగాలను పంపిస్తూ ఎన్ కౌంటర్‌లో చేస్తోంది. ఆపరేషన్ కగార్‌లో..

మిగతా 2వ పేజీలో..

## మృత్యు మలుపు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

- డీసీఎం వాహనాన్ని ఢీకొన్న కారు
- పసుమాముల - కుంట్లూర్ రోడ్డులో ప్రమాదం
- మృతులు కుంట్లూర్ గ్రామానికి చెందిన వారే

03



## పాకిస్తాన్‌తో గూఢచర్యం నిజమే !

- అంగీకరించిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా
- డానిష్‌తో కలిసి పాకిస్తాన్‌లో పర్యటనలు
- పహల్గాం ఘటనకు ముందే సంబంధాలు ఉన్నట్టు అంగీకారం



02

# నేలకొరిగిన దళపతి



**మొదటి పేజీ తరువాత..**

భాగంగా బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మృతిచెందగా.. చాలా మందికి గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతేవాడ డీఆర్జీ బలగాలు భారీగా పాల్గొన్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (70) మృతి చెందారు. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా కేశవరావు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేశవరావుపై కోటిన్నర రివార్డు ఉంది. ఈ ఎదురుకాల్పుల్లో కేశవరావుతోపాటు మరికొందరు కీలక నేతలు హతమైనట్లు పోలీసులు చెబుతున్నారు. చంద్రబాబు నాయుడిపై అలిపిరిలో బాంబుదాడి ప్రధాన సూత్రధారి అయిన నంబాల కేశవరావు ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయారు. 2010లో 76 మంది సీఆర్ పీఎఫ్ జవాన్ల మృతిలోనూ ఇతనిదే కీలకపాత్ర. మావోయిస్టు అగ్రనేత గణపతి రాజీనామాతో 2018 నుంచి పార్టీకి సుప్రీం కమాండర్‌గా కేవశవరావు బాధ్యతలు వహిస్తున్నారు. ఇతను గెరిల్లా వ్యూహాలు రచించడం, ఐఈడీలు పేల్చడంలో దిట్ట. ఎంటెక్ చేస్తున్న సమయంలో నక్సలిజానికి ఆకర్షితుడయ్యారు.

నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు నేపథ్యం..

1955లో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలంలోని జీయన్న పేటలో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని కాకతీయ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్‌ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

వరంగల్ ఆర్‌ఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. విద్యార్థి దశలో వామపక్ష విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొని, రాడికల్స్ స్టూడెంట్ యూనియన్ సభ్యుడిగా పనిచేశారు. 1980లో విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణలో అరెస్ట్ అయిన తర్వాత స్వగ్రామాన్ని వదిలి నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లారు. మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు నంబాల.1980లో ఏర్పడిన సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్‌లో ముఖ్యమైన సభ్యుడిగా ఉన్నారు.


1987లో అంబుష్ వ్యూహాలు, పేలుడు పదార్థాల వినియోగంపై శిక్షణ పొందారు. 2004లో సీపీఐ పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా విలీనంతో ఏర్పడిన మావోయిస్టు పార్టీకి కేంద్ర సైనిక కమిషన్ అధిపతిగా నియమితులయ్యారు. 2018 నవంబర్ 10న ముప్పల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి రాజీనామా చేసిన తర్వాత నంబాల కేశవ్ రావు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గెరిల్లా యుద్ధ వ్యూహాలు, పేలుడు పదార్థాల వినియోగంలో నంబాల నిపుణుడు. నంబాలపై ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. భద్రతా దళాలపై జరిగిన పలు ప్రధాన మావోయిస్టు దాడుల్లో నంబాల పాత్ర కీలకం. నంబాల కేశవరావుపై ఒక కోటి రివార్డు కూడా ఉంది. నంబాల భార్య కూడా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుకుగా ఉన్నారు.

### సల్వాజుడుంపై కేశవరావు..

మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు, ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. 2010లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతో పాటు మరో 27 మంది మరణించారు


## బలగాల విజయం గర్వకారణం

### ప్రధాని నరేంద్ర మోదీ



ఛత్తీస్‌గఢ్ భారీ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. భద్రతా బలగాల విజయం గర్వకారణమని ట్వీట్ చేశారు. దేశంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు నక్సలిజం నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. కాగా ఇవాళ ఛత్తీస్గఢ్లోని నారాయణపూర్-బీజాపూర్ మధ్య ఉన్న ఇంద్రావతి అభయారణ్యంలో జరిగిన భీకర ఎన్‌కౌంటర్లో 27 మంది నక్సల్స్ మరణించారు.

### ఎక్స్ లో అభినందించిన అమిత్ షా..



ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరి గిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించా రు. 'నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం. ఈరోజు, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరి గిన ఆపరేషన్‌లో మన భద్రతా దళాలు 27 మంది భయంకరమైన మావోయిస్టులను మట్టుబెట్టాయి. సీపీఐ - మావో యిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నాయకుడు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజంపై భారత్ చేసిన మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నాయకుడిని మన దళాలు మట్టుబెట్టడం ఇదే మొదటిసారి. మావోయిస్టులను హతమార్చిన మన ధైర్యవంతులైన భద్రతా దళాలు , ఏజెన్సీలను అభినందిస్తున్నాను. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత 54 మంది నక్సలైట్లను అరెస్టు, 84 మంది నక్సలైట్లు లొంగిపోయారని తెలియజేయడం సంతోషంగా ఉంది. మార్చి 31, 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది అంటూ అమిత్ షా ట్వీట్ చేశారు.

# పాకిస్తాన్‌తో గూఢచర్యం నిజమే !

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

- అంగీకరించిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా
- డానిష్‌తో కలిసి పాకిస్తాన్‌లో పర్యటనలు
- మొబైల్స్‌లో మారు పేర్లతో వివరాలు ఫీడ్
- సోషల్ మీడియాలో ఏజెంట్లతో టచ్‌లోకి వెళ్లిన వైనం
- పహల్గాం ఘటనకు ముందే సంబంధాలు ఉన్నట్టు అంగీకారం

పాకిస్థాన్ తరపున గూఢచర్యం చేసినట్లు యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అంగీకరించినట్లు సమాచారం. దేశద్రోహం కేసులో ఇటీవల అరెస్ట్ అయిన హర్యానాకు చెందిన జ్యోతి మల్హోత్రా, పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఒప్పుకుందని హిసార్ పోలీసులు తెలిపారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో తాను తరచుగా సంప్రదింపులు జరిపిందని ఆమె ఒప్పుకున్నారని వివరించారు.

'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ ఛానల్ ఉన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్తాన్ వెళ్లడానికి వీసా పొందడానికి ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌కు వెళ్లినట్లు తెలిపింది. అక్కడ అహ్సన్-ఉర్-రహీం అలియాస్ డానిష్‌తో పరిచయం ఏర్పడిందని, తన మొబైల్ నంబర్ తీసుకొని తరచుగా అతనితో మాట్లాడేదానినని, రెండుసార్లు పాకిస్థాన్‌కు కూడా వెళ్లానని తెలిపింది. అక్కడ డానిష్ తనకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాడని, అంతేకాకుండా తన ప్రయాణానికి కూడా ఏర్పాట్లు చేశాడని



విచారణలో చెప్పింది. డానిష్ ద్వారా పరిచయమైన అలీ హసన్ అనే వ్యక్తి తనకు పాకిస్థాన్ నిఘా అధికారులుగా ఉన్న షకీర్, రాణా షాబాజ్ లను పరిచయం చేశాడని తెలిపింది. షకీర్ మొబైల్ నంబర్‌ను తన మొబైల్‌లో 'జాట్ రాధావన్' అనే పేరుతో సేవ్ చేసుకున్నానని, అందువల్ల తనను ఎవరూ అనుమానించలేదని తెలిపింది.

భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత తాను వాట్సాప్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లతో టచ్‌లోనే ఉన్నానని, ఈ క్రమంలోనే దేశానికి సంబంధించిన సమాచారాన్ని వారికి షేర్ చేసేదానినని జ్యోతి మల్హోత్ర ఒప్పుకుంది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌లో డానిష్‌ను తాను చాలాసార్లు కలిసినట్లు తెలిపింది. త్రివిధ దళాల వివరాలను పాకిస్థాన్ నిఘా సంస్థకు చెందిన కార్యకర్తలతో, ముఖ్యంగా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పిఐఓలు)గా ఉన్న షకీర్, రాణా షాబాజ్ అనేలతో అత్యంత సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అధికారుల విచారణలో అంగీకరించింది. ఎవరికి అనుమానం రాకుండా స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వేరే ఐడీలను ఇందుకు ఉపయోగించింది. అట్టారి, రాజస్థాన్ సరిహద్దుల్లో దళాల మోహరింపునకు సంబంధించిన రహస్య వివరాలను షకీర్‌తో షేర్ చేసినట్లు విచారణలో ఒప్పుకుంది.

వెన్‌కాబ్ ఫ్రెష్ చికెన్
Vencobb Fresh Chicken RNR Fresh Chicken
No.1 & the Tastiest Chicken in the world

| | |
|---|---|
| ఫార్మ్ రేటు | - 125 |
| రిటైయిల్ లైవ్ | - 147 |
| విత్ స్కిన్ | - 213 |
| స్కిన్‌లెస్ | - 243 |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీ చేయడమైనది
condition apply

# మృత్యు మలుపు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు
- డీసీఎం వాహనాన్ని ఢీకొన్న కారు
- పసుమాముల - కుంట్లూర్ రోడ్డులో ప్రమాదం
- మృతులు కుంట్లూర్ గ్రామానికి చెందిన వారే



**గోల్కొండ టైమ్స్, హయత్‌నగర్**

హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరులో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. హయత్ నగర్ సీఐ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాలు.. కుంట్లూరు గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు మంగళవారం రాత్రి పెద్ద అంబర్ పేటలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఆదే రాత్రి నాంపల్లిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో బస చేశారు. బుధవారం తెల్లవారుజామున స్కోడా కారులో స్వగ్రామం కుంట్లూర్‌కు వస్తూ మృత్యువాత పడ్డారు.

**రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోపు..**

కారులో ఇంటికి బయలుదేరిన నలుగురు యువకులు పసుమాముల గ్రామం నుంచి కుంట్లూరు వైపు స్కోడా కారు(ఎంహెచ్ 02 డీజీ 0771)లో వస్తున్నారు. కుంట్లూర్ గ్రామంలోని నారాయణ కాలేజీ (బాసర క్యాంపస్) సమీపంలో.. అదే సమయంలో కుంట్లూరు నుంచి పసుమాముల వైపు డీసీఎం వ్యాన్ (టీఎస్07 యూకే 2664) వస్తున్నది. నారాయణ కాలేజ్ సమీపంలోని మూల మలుపు వద్ద అతివేగంతో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కుంట్లూర్ గ్రామానికి ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు చంద్రసేనారెడ్డి (24), చుంచు జంగారెడ్డి కుమారుడు త్రినాథ్‌రెడ్డి (24), చుంచు శ్రీనివాస్ రెడ్డి కుమారుడు వర్షిత్‌రెడ్డి (23) అక్కడికక్కడే చనిపోయారు. ఈ ప్రమాదంలో మరో యువకుడు అలిమేటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు పవన్ కల్యాణ్‌రెడ్డి (24) తీవ్రంగా గాయపడడంతో స్థానిక దవాఖానలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మలక్ పేటలోని యశోద దవాఖానకు తరలించారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కారులో ఇరుక్కున్న వారి మృతదేహాలను బయటకు తీశారు. రెండు నిమిషాలైతే ఎవరి ఇండ్లకు వారు చేరేవారని, అంతలోనే ప్రమాదం జరిగిందని స్థానికుల వాపోయారు.

**మృతులంతా ఇంటికి ఒకరే కొడుకు..**

కుంట్లూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులంతా ఇంటికి ఒక్క కొడుకు. ఇటీవల చదువులు పూర్తి చేసి, వ్యాపారం చేస్తున్నారు. ఇంటికి ఆసరాగా ఉంటారనుకున్న యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గాయపడిన యువకుడి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఒకే గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామస్తులు సైతం ముగ్గురు యువకులు మృతి చెందడంపై కన్నీరు పెట్టుకున్నారు. బుధవారం సాయంత్రం ముగ్గురు యువకుల అంత్యక్రియలు ముగిశాయి.

**మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ..**

కుంట్లూర్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానికులు బాధిత కుటుంబీకులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# బోడుప్పల్, పీర్జాదిగూడలో హైడ్రా కమిషనర్ పర్యటన

**గోల్కొండ టైమ్స్, మేడ్చల్**

మేడ్చల్ జిల్లా బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లలో బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలపై జంట మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి హైడ్రాకి అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులలో భాగంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మధ్యాహ్నం సమయంలో, ఫిర్యాదు దారులు ఇచ్చిన ప్రదేశాలను పరిశీలించారు. ఉదయమే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలోని సేజ్ స్కూల్ అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేయడం, మధ్యాహ్నం రంగనాథ్ పర్యటించడం ప్రాధాన్యత చోటుచేసుకుంది. ఆరు నెలలుగా ముస్లిం క్రిస్టియన్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్‌లోని ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటిక కబ్జా స్థలాన్ని రంగనాథ్ పరిశీలించారు. సర్వే నంబర్ల తారుమారు చేసి కొంత మంది కబ్జాదారులు శ్మశాన వాటికలు కబ్జా చేశారని రంగనాథ్‌కి విన్నవించుకున్నారు. శ్మశాన వాటికలలో ఎన్నో సంవత్సరాలుగా సమాధులు ఉన్నాయి. సమాదులు ఉన్న శ్మశాన వాటికల భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎలా స్వాధీనపరిచారని తహసీల్దార్‌ని రంగనాథ్ ప్రశ్నించారు. ముస్లిం క్రిస్టియన్ ప్రతినిధులకు మరో మూడు, నాలుగు రోజులల్లో మీ సమస్యను తీర్చుతానని హామీ ఇచ్చి రంగనాథ్ వెళ్లిపోయారు. రంగనాథ్ హామీతో ముస్లిం, క్రిస్టియన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

# నాగం పిటిషన్ ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

- పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేయాలని పిటీషన్
- హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్ట్

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలున్నాయంటూ, సీబీఐ దర్యాప్తు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకునే అవసరం లేదని స్పష్టంగా పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారించింది. దాదాపు ఐదేళ్లుగా విచారణ కొనసాగుతున్న ఈ పిటిషన్‌కు నేడు తెరపడింది. మేఘా ఇంజినీరింగ్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపించారు. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో దీనికి సంబంధించి ఐదు పిటిషన్లు కొట్టివేయబడ్డాయి. ఇందులో ఎలాంటి మోసం లేదని, అవకతవకలు లేవని సివిసీ నివేదికలో కూడా తేల్చిందని తెలిపారు. ఎస్టిమేట్లు పెరిగిన విషయాన్ని తప్పుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా బీహెచ్ఈఎల్ వంటి కీలక భాగస్వామి సంస్థ కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఒకటి రెండు డాక్యుమెంట్లను ఆధారంగా చేసుకొని ఈ కేసులు వేయడం దురుద్దేశపూరితమని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ సజావుగా కొనసాగుతోందని, అభివృద్ధికి ఇది కీలకమైందని అన్నారు. నాగం తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించినా, కోర్టు వాటిని సమర్థించకపోవడంతో పిటిషన్‌ను తిరస్కరించింది.



# సేజ్ స్కూల్ అక్రమ నిర్మాణాల కూల్చివేత

**రంగనాథ్ ఆదేశంతో కూల్చివేసిన హైడ్రా అధికారులు**

**గోల్కొండ టైమ్స్, మేడ్చల్**

మేడ్చల్ జిల్లా మేడిపల్లి లోని సెజ్ స్కూల్ యాజమాన్యం రోడ్డును ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. మేడిపల్లి సర్వే నంబర్ 26ఏలో 15 సంవత్సరాల క్రితం సేజ్ స్కూల్ యాజమాన్యం వెంచర్ నిర్మించారు. మేడిపల్లి ఆర్ఏఆర్ కాలనీ నుంచి హైదరాబాద్ వరంగల్ నేషనల్ హైవేకు వెళ్ళే లింక్ రోడ్డును సేజ్ స్కూల్ యాజమాన్యం నిర్మాణాలు చేపట్టింది. గత 15 సంవత్సరాలుగా కాలనీ వాసులు అక్రమ నిర్మాణాలపై పోరాడుతూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన హైడ్రా తీసుకురావడంతో, ఈ మధ్య కాలంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు చేశారు. రంగనాథ్ ఆదేశంతో హైడ్రా అధికారులు ఉదయం 7 గంటల సమయంలో కూల్చివేతలు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. రోడ్డు కబ్జాపై పోరాడుతున్న కాలనీవాసులు, హైడ్రా తీసుకున్న చర్యల ఆనందం వ్యక్తం చేశారు.

# రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

- బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ
- ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..

**గోల్కొండ టైమ్స్, చౌటుప్పల్**



ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజా నాయకుడు కేసీఆర్‌కు రాజకీయ దురుద్దేశంతో, కుట్ర పూరితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ తీవ్రంగా ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో, కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు.. కుతంత్రాలు చేసినా, అబద్ధాలు ఆడి దుష్ప్రచారాలు చేసినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ప్రజల్లో వస్తున్న ఆదరణ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న అనూహ్య స్పందనను చూసి రాజకీయ దురుద్దేశంతో రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసీఆర్‌ని కాళేశ్వరం కమిషన్ పిలుస్తుందన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే కమిషన్ కేసీఆర్, హరీష్ రావుకి నోటీసులు పంపారని తెలంగాణ ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును ప్రజలందరూ నిర్దిష్టంగా గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల మీద ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీల మీద ఈ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు.

# ముందస్తు రుతు పవనాలు

- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- మార్గానిర్దేశకాలు జారీ చేసిన విపత్తు నిర్వాహణ సంస్థ
- 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేస్తూ నిర్ణయం



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు.

హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు.

**ప్రభుత్వ మార్గానిర్దేశకాలు విడుదల..**

ఈ నెలాఖరులోగా రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని, దీనితో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున, ఏవిధమైన విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో మే మాసాంతం వరకే రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తగు మార్గదర్శకాలను విడుదల చేశారు.

2024 ఆగస్టు మాసంలో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు చేరుకోకపోవడంతో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈ సారి 12 స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్ లో తెలంగాణ స్పెషల్ పోలీస్ కు చెందిన వంద సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను రాష్ట్రంలోకి పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని చెప్పారు. తద్వారా, ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వచ్చినా, వెంటనే సమీపంలోని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుంటాయని కలెక్టర్లకు తెలిపింది. దీనితో పాటు, ఈ సారి మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు వచ్చే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఎన్డీఆర్ఎఫ్ కు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న అన్ని ఫైర్ స్టేషన్లలో ఫైర్ సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇప్పించామని అన్నారు. హైదరాబాద్ తో పాటు శివారు ప్రాంతాలకు తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేసాం. భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలు వస్తే నష్టాలను తగ్గించడానికి పై చర్యలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు.

భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశముంటే, సంబంధిత జిల్లాలకు కేటాయించిన ఎస్డీఆర్ఎఫ్ , ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో టచ్ లో ఉండాలని ఆయా బృందాల వివరాలు సంబంధిత అధికారులకు కూడా ఇవ్వాలని సూచించారు. అప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల ఫైర్ ఆఫీసర్లతో సంప్రదిస్తూ, స్టేట్ డిజాస్టర్ ఫోర్స్ సేవలను పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ సేవలు కావాలంటే స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖతో టచ్ లో ఉండాలని పేర్కొన్నారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. తమ జిల్లాలోని వరదలు, వర్షాల వల్లముంపు ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు.

# పాలన చేతగాక నోటీసులా ?

- బీజేపీ, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకం
- ప్రజా సమస్యలపై దృష్టి మరలుస్తున్నా ప్రభుత్వం
- కాళేశ్వరం కమిషన్ నోటీసులపై కేటీఆర్ స్పందన

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**




దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇదంతా కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న నాటకమని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడంపై ఆయన మాట్లాడారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా హామీల అమలుపై ప్రభుత్వాన్ని వదలేది లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నోటీసులు ఇస్తున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోందని ఫైర్ అయ్యారు.

కమిషన్ పాలనపై కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదని స్వయంగా సాక్ష్యంగా చెబుతున్నారన్నారు. ఈ రాష్ట్రంలో కమిషన్‌ల పాలన నడుస్తోందని ప్రజల పాలన కాదని మాజీ మంత్రి అన్నారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదనిపాలన కనిపించడం లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోయారని, కానీ అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయిందని విమర్శించారు. కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి కూడా సాహసం చేయలేకపోయారన్నారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్ప లేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. నల్గొండలో సుంకేసుల ప్రాజెక్ట్ కూలిందని.. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు.

# కేసీఆర్ చేసిన తప్పే చేస్తున్న రేవంత్‌రెడ్డి

- కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరువుతా
- స్పష్టం చేసిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**



గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. కాళేశ్వరం విచారణకు హాజరవుతానని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే తనకు ఇంత వరకు నోటీసులు అందలేదన్నారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు వంద శాతం హాజరవుతానని ఆయన స్పష్టం చేశారు. తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి, అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.." ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. నువ్వు మమ్మల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

# తెలంగాణకు ఎల్లో అలెర్ట్ !

- రానున్న ఐదు రోజులు వానలు
- 40-50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రాగల ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపై నున్న ఉపరితల ఆవర్తనం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల విస్తరించి ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో బుధవారం నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణ లోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

Publish, printed & Owned by GOLCONDA TIMES MEDIA NETWORK, Survey of INDIA, Uppal, Hyderabad -500039, Cont: +919542605665, +918977912565, mail us: golcondatimes99@gmail.com, E-mail: admin@golcondatimes.com.